


# ఆనికాని

## రాచకొండ విశ్వనాథశాస్త్రి

ఈ కథ రాయాలని నాకు చాలాకాలంనుంచీ వుంది. తీరా, రాద్దామని కూర్చునేసరికి ఎలా మొదలుపెట్టడం, ఎలా రాయడం అని చాలా సేపు ఆలోచించవలసొచ్చింది. ఆలోచించగా నాకు తెలిసిన పెద్దమనిషి ఒకాయన గుర్తుకొచ్చి ఆయన చెప్పిన సలహా జ్ఞప్తికొచ్చింది. ఆయన ఏవిటన్నాడంటే: కథలో ప్రధానరసం, లేక ఓ సన్నివేశంలో ప్రధానరసం – దాని ప్రకారం అన్నీ సరిదిద్దుకోవాలండీ అన్నాడు. వాతావరణమంతా మన కథకనుగుణ్యంగా చిత్రించుకోవాలండీ అన్నాడు. అంటే కథలోని నా మనసులో తుఫాను రేగినప్పుడు, ఉరుములు మెరుపులు పెనుగాలి బీభత్సం వాటినన్నింటినీ పిలకలు పట్టుకు లాక్కొచ్చి వాటిని నా చుట్టూ తిప్పకోవాలన్నమాట. సాఫీగా సాగిపోయే నా ప్రేమలత టక్కున తెగిపోయినప్పుడు, ఎక్కణ్నించో అక్కణ్నుంచి వీణ నొకటి ఎత్తుకొనైనా వచ్చి దాని తీగెలు తెంపుకొని దానిమీద నా తలని దీనంగా వాల్చుకోవాలన్నమాట. నా ఆశలన్నీ వాడిపోయి రాలిపోయినప్పుడు మోడైపోయిన చెట్టు నొకదాన్ని వెతికి వెళ్ళి చూసుకొని అక్కడ మోకాళ్ళమీద తలపెట్టుకొని కూర్చోవాలన్నమాట. నా కిష్టంలేనప్పుడు ఆకాశం సిరా పులిమినట్టుగా వుండాలన్నమాట. నాకు సరదా పుట్టినప్పుడు అది వజ్రాలు పొదిగినట్టుగా వుండాలన్నమాట. నాకు తెలిసిన ఆ పెద్దమనిషి చెప్పిన సూత్రం ప్రకారం ఈ కథ మొదలుపెట్టేసరికి –

రాత్రి పదకొండు గంటల సమయంలో ఊరవతల నూకరాజు పాకవతల వున్న ఇసక మైదానం, వెన్నెల వెలుగులో పరచిన బంగారు తివాసీలా వుంది. మైదానం మధ్య దంపతుల్లా నిల్చున్న తాటిచెట్ల కొమ్మలు, చల్లగాలి పెట్టే కితకితలకి, కిలకిల్లాడుతున్నాయి. వాటిపక్కనే ఇసకతిన్నెమీద కూర్చున్న నూకరాజు పాతికేళ్ల పడుచుతనంతో, సొగకళ్లతో, సూదిముక్కుతో, సొగసైన మీసంతో పుష్పబాణుల్లా ధగధగ లాడుతున్నాడు. ఆకాశంలో చంద్రుడు ఎలా మెరుస్తున్నాడంటే, తిన్నెమీది నూకరాజులా జిగజిగ మెరిసిపోతున్నాడు.

ఈ కథకి నూకరాజు హీరో.

ఆ తిన్నెమీది చంద్రుడు ఏదో చుక్క రాకకోసం ఎదురుచూస్తూండగా, అంతలో అల్లంత దూరంలో ఓ చుక్క మిలమిల్లాడింది. "తాటి సెట్లాన వాలెట్టు"కొని ముందుకి నడిచింది. చుక్కని చూడగానే 'పరిగెట్టి ఎదురెళ్ళి' ఎత్తుకు తీసుకొచ్చి వళ్లో వేసుకున్నాడు నూకరాజు.

వళ్ళో వున్న పిల్ల పేరు నాగరత్నం.

ఆమె ఈ కథకి హీరోయినా?

మీరే చెప్పాలి.


ఆమె, పదిహేడేళ్ల కుర్రవాడి కంటికి అట్టమీద కనిపించిన అహల్యాదేవి బొమ్మలా వుంది. ఆమె పద్దెనిమిదేళ్ల బంగారం. ఆమె నూకరాజుకి దొరికిన పెన్నిధి.

జంట తాటిచెట్లదగ్గర కూర్చున్న వాళ్ళిద్దర్నీ చూడ్డానికి చల్లగాలి చప్పుడు చెయ్యకుండా ఒచ్చింది. వాళ్లని చూదు చూడని పైనున్న చంద్రుడు పక్కనున్న చుక్కకి సైగచేసేదు. చూసి సిగ్గుపడ్డ చుక్కమ్మ తెలి మబ్బు చెంగుని చాటు పెట్టుకొని దొంగచూపు చూసింది!

చంద్రుడూ, చుక్కలూ, చల్లగాలీ వాళ్ళిద్దర్నీ చాల సేపు చూసేక నూకరాజు నాగరత్నంతో "మనిద్దరం పెళ్ళాడ్దాం! ఏం?" అన్నాడు.

పెదవుల్ని విడిపించుకొన్న తరవాత, నాగరత్నం

26–11–93 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక



"మా అమ్మక్కూడా ఇష్టవే" అంది.

"నీకెలా తెల్సు?" అనడిగేడు నూకరాజు సంతోషం పట్టలేకుండా.

"నిన్ను పెళ్ళి సేసుకోమని రోజుకీ సెప్తుంది" అంది నాగరత్నం. మరింక నూకరాజుకి సంతోషం ఆగలేదు. ఆ సమయంలో అప్పాయమ్మ అక్క డుంటే ఆమెని కూడా వాటేసుకుని ముద్దులాడేసుండు నతను. అప్పాయమ్మంటే నాగరత్నం తల్లి.

నాగరత్నం ఆమె తల్లీ పట్నం వచ్చి పది ఆదివారా లవుతుంది. నూకరాజు అయిదారు సంవత్సరాల కిందటే వచ్చి హార్బర్లో కళాశీగా కుదురుకున్నాడు. అతనుండేది ఊరిచివర. ఆరూగదుల తాటి కమ్మ లవాస ఇంట్లో ఓ గదిలో అద్దెకి వుంటున్నాడు.

ఓ రోజు సాయంకాలం హార్బర్లో కూలీ చేసు కొని నెమ్మదిగా ఇంటికొస్తూ ఇంటివైపు చూసేసరికి నూకరాజు కంటికి కొసా గది గుమ్మం ముందు ఉదయకిరణంలా ఓ పిల్ల కనిపించింది. దేవత వెలిసిందా అనుకున్నాడు నూకరాజు. కాళ్ళూ చేతులూ ముఖం తొందరగా కడుక్కొని భోగట్టా చెయ్యడానికి బయల్దేరి వెళ్ళేడు.

సూర్యుడు అస్తమించీసేడు. వెన్నెల మసగమ సగ్గా వెలుగుతోంది. ఇంటిముందు నులకమంచం మీద నూకరాజు కూర్చున్నాడు. ఎదురుగా ఓ విరి గిన ఇటికిమీద కూర్చొని తన వృత్తాంతమంతా అతన్తో చెప్పనారంభించింది అప్పాయమ్మ.

వింటే అదేం కొత్త వృత్తాంతం కాదు. సాధా రణంగా జరిగేదే. వాళ్ళదసలు తాళ్ళవలసట. అప్పాయమ్మకి 'కన్నోరిదీ అత్తోరిదీ' కూడా ఆ వూరే. బతికి బాగుపడ్డ వూరూ అదే. నెత్తిమీద 'కాంగేసుకొని ఒచ్చీసిన' వూరూ అదే. అక్కడే ఆమె కాపురం కూలిపోయింది. అక్కడే ఆమె సంసారం చల్లారిపోయింది. ఆమె కడుపున పుట్టిన మగపిల్లలంతా అక్కడే 'మంటగలసిపో నారు'. తాళికట్టినవోణ్ణి మశూచికమనే ఆసిరెమ్మ అక్కడే 'పొట్టనెట్టుకుంది.' అక్కడున్న 'దోసిడు మడి సెక్కా' కోర్టువారు అక్కడికే వచ్చి టమటమ లాడించీసినారు. అన్నీ పోగా మిగిలిన తాతలనాటి ఇల్లు మట్టి దిబ్బయిపోయి ఇప్పటికీ అక్కడే వుంది.

'కట్టుకున్న మొగుణ్ణి సంపేసుకున్నాను. కన్న కొడుకుల్ని సంపేసుకున్నాను బాబూ. కాన్నాకు సావు రాలేదు. పుస్తిలతాడు పోనాది. పుట్టిన పిల్లలు పోనారు. ఏళ్ళు పోనాయి. ఎడ్లు పోనాయి. ఏరుకున్న గింజలు పోనాయి. కడాకి నమ్ముకున్న భూదేవత కూడా పోనాది.

కాని, రమ్మని పిల్చినా అప్పాయమ్మ కింతవరకూ సావింకారానేదు! మరింకేటుంది? ఒక్కగానొక్క ఆడకూతురుంది. ఈ ఆడకూతుర్నెట్టుకొని ఈ ముసిలి ముండ కూతురేటి సెయ్యడం బాబూ?



ఆ మధ్య తీవ్ర అనారోగ్యానికి గురైన రా.వి.శాస్త్రిగారు కోలుకోవడమే గాక, కోల్పోయిన రచనోత్సాహాన్ని తెచ్చు కుని కొత్తగా రచనలు చేస్తున్నందుకు సాహిత్యాభిమానులంతా చాలా సంతో షించారు. ఆ సంతోషం ఇలా సంతా పంగా మిగిలిపోతుందని అనుకోలేదు.

తెలుగు కథపై రా.వి.శాస్త్రి ప్రభావం గురించి ఆలోచించదల్చుకుంటే, 'తెలుగు కథ – రా.వి. శాస్త్రికి ముందు, తర్వాత' అని విభజించుకోవాలనిపిస్తుంది. భావకవి త్వంపై కృష్ణశాస్త్రి ప్రభావం ఎంత వుందో, కథపై రా.వి.శాస్త్రి ప్రభావం అంత వుంద నిపిస్తుంది. ఆయన, కథకు మెరుపు వేగాన్నీ, వెన్నెల సౌందర్యాన్నీ ఇచ్చారు! కన్నీటి తడినీ, కొట్టుకునే గుండె సడినీ కథకు బయటా, లోపలా అమర్చారు!

ఆ మహా కథకుడి కథలలో నుంచీ యీ కథను మా పాఠకులకు అందిస్తు న్నాము.

– ఎడిటర్

మరింకక్కడేటుందిగనక సెయ్యడానికి. సేసేదేం నేక డొక్కలు సేత్తో ఒట్టుకొని ఇదిగో పట్నావిలా పారొచ్చినాం. కూలిదొక్కితే సుష్టు. నేకపోతే పస్తు."

"అరె! అయితే మీకెవరూ దిక్కు లేరన్న మాట!" అన్నాడు నూకరాజు.

"దిక్కెవరు నూకరాజు బాబూ!? దరణి బూదేవి, ఆపైన దేవుడు ఆ యెనక నీలాటి మారాజు లూను." అంది అప్పాయమ్మ. ముంగిట్లో ఇద్దరూ అలా మాట్లాడుతూ వుంటే చూరుకింద నీడలో రాటనానుకొని కూర్చొంది నాగరత్నం. తనకథంతా నూకరాజుతో తల్లి చెప్తున్నప్పుడు ఆమె గుండెలు శోకం వల్ల పొంగిపొంగి దిగేయి. చూరవతలి వెన్నెల ఆమె తడిసిన కళ్ళల్లో సలసల కాగింది.

అనురాగం అంకురించడంతో తలొకరూ తలోలా చేస్తారు. ఒక్కొక్కడు అవతల పార్టీకి తన మన సుని రెండు చేతుల్తోనూ పట్టుకు వెళ్ళి ముందే అర్పణ చేసేస్తాడు. మరొకడు అవతలపార్టీ మన సుని జబర్దస్తీగా దోచేస్తాడు. లేకపోతే చల్లగా లాగేస్తాడు. నూకరాజు ఆ సాయంకాలమే తన మనసుని నాగరత్నానికిచ్చేసి ఆమెనీ ఆమె తల్లినీ "ఆదుకొంటాను" అని భీష్మ ప్రతిజ్ఞ పట్టేసేడు. ఆ క్షణం నుంచీ వాళ్లకతను కంటికి రెప్పా కాలికి చెప్పూను. కొంతమందికి చాకిరీ చేసి మెప్పించడమే కాన్నిషోకు చేసి మెప్పించడం తెలిదు.నాలుగు రోజుల్లో వాళ్లకి నాలుగేళ్ళ సేవ చేసేడు నూకరాజు.

ఆ రోజున అప్పాయమ్మ కంటికి ఎటు చూసినా ఒక్కలాగే వుంది. చంద్రుడు బూజుపట్టిపోయి వేళ్లాడుతున్నాడు. వెన్నెలంతా పాలిపోయి బూడి దలా వుంది. చెట్లన్నీ జీవచ్ఛవాల్లాగా, పైనున్న చుక్కలన్నీ చావబోయేవాళ్ళ ప్రాణాల్లాగా వున్నాయి. మరి, గాలి బిగిసిపోయి చచ్చేపోయింది. ఇంతలో కాలం ఎలా తిరిగిందంటే రాట్నంలా గిర్రున తిరి గింది. ఆ రోజున అస్తమించిన సూర్యుడు ఆ తరువాత అరవైసార్లు ఉదయించేడు. నూకరాజు దయవల్ల అప్పాయమ్మకీ నాగరత్నానికీ ఆ అరవై రోజుల్లోనూ కూలిదొరకని రోజు ఒక్కరోజూ లేదు. మరి అప్పాయమ్మ కెటు చూసినా ఒక్కలా చక్కగా వుంది. చంద్రుడికి బూజులు పోవడంతో వెన్నె లకి తేటొచ్చింది. గాలికి చలనం, చెట్లకి చైతన్యం చుక్కలకి ప్రాణాలూ ఒచ్చేయి. అదంతా అలా పున్నమినాటిరేయిలా వుండడం నూకరాజు పనివా డితనం.

పెళ్లాడ్డం 'అమ్మక్కూడా ఇష్ట'మేనని తెలుసుకున్న నాటి రాత్రి నూకరాజుకి సుఖంవల్ల నిద్రపట్ట లేదు. అయినా మర్నాడు ప్రొద్దున్న మంచంమీంచి సంతోషంతో చెంగున గెంతేడు. పన్లోకి సంతో షంతో వెళ్ళేడు. ఇంటికెంతో సంతోషంతో వచ్చేడు. ఆ విధంగా ఆ రోజు, మర్నాడు, మరో రోజు మరోరోజు వరసగా సంతోషంతోనే వెళ్ళేది.

అయితే–కాలం ఒక్కలా వుండదనే సంగతి మీకూ నాకూ అప్పాయమ్మకీ బాగా తెలుసు. ఆ సంగతి నూకరాజు క్కూడా ఓ రోజున బాగా తెలిసొచ్చింది. ఆ రోజు సాయంకాలం పన్లోంచి ఇంటికొస్తూ ఇంటికి అల్లంత దూరంలో టక్కున ఆగేడు నూకరాజు.

ఈ క్షణం నుంచీ నాకు కష్టాలు ప్రారంభ మౌతాయి. నష్టాలు సంభవిస్తాయి అని ఎవరి మట్టుకి వారికి కొన్ని కొన్ని సమయాల్లో, తగి నంత బలమైన కారణం లేకుండానే, అనిపిస్తుంది. అప్పాయమ్మ ఇంటి ముందు ఓ పదిమంది మూగి వుండడం మాత్రం చూసేడు నూకరాజు. 'ఆఁ, మనకేదో కీడు మూడిందిరా' అని అతనికి తోచ డానికి అంతకంటే ఎక్కువ కారణం ఏమీలేదు. ఊరవతల, పాకలవెనక, కొండవెనక సూర్యుడు కునికీసేడు. అటుకేసి చూస్తే కొండవెనక ఊరు కాలిపోతున్నట్టుగా ఉంది. అంతటా ఎరుపు డౌలు కమ్ముకొంది. నూకరాజు కొంచెం ముందుకి నడచే సరికి ఓ ఆడమనిషి ఏడుపు అతని చెవిని పడింది. ఏడుపు వినిపిస్తోందే కాని ఏడ్చే మనిషి కనిపిం చడం లేదతనికి. తొందరగా ముందుకి నడుస్తూ అతను 'నాగరత్నం నాకిక లేదు' అనుకున్నాడు. వెళ్లి జనాన్ని ఒత్తిగిలించి చూస్తే అక్కడ నాగరత్నం నిజంగానే లేదు. అప్పాయమ్మ నెత్తీ నోరూ కొట్టు కొని ఏడుస్తోంది.

ఏం జరిగిందని అడుగుతే 'గోరవైఁ పోనాది బాబూ', 'గోరం గోరం బాబూ', 'గోరం కాక పోతే ఇంకేటి బాబూ' అనడమేకాని ఎవరూ ఏమీ చెప్పరు. అప్పాయమ్మ మాట్లాడదు. ఏడుపు మానదు. ఆఖరికి నూకరాజు కేకలువేసి అడగ్గా ఏడుస్తూ ఏడుస్తూ అప్పాయమ్మా, దగ్గుతూ దగ్గుతూ ఓ ముసలాడూ కలిసి జరిగిన సంగతంతా చెప్పేరు. కొన్ని కొన్ని వివరాలు కొంత మంది మధ్య మధ్య అందిచ్చేరు.

అసలు ఏమిటి జరిగిందిటా అంటే:

సాయంకాలం నాగరత్నం ఇంటికి 'బేగొచ్చేసి' బజారుకి వెళ్లి గింజలు కొనుక్కొచ్చి వాటిని చేట్లో వేసుకొని ఇంటి ముందు కూర్చొని చెరుక్కొం టోందట. అంతలో ఎండాడ మనిషొకామె 'ఎర్రగా పొడుగ్గా వుంటది; పొడుక్కాళ్ళ డాకూ; ఊరందర మందరీ ఎరుగుదురు', ఆ మనిషి గోనెమూ టొకటి నెత్తిని పెట్టుకొచ్చి, మూట దించుకొని 'ఓలమ్మ కుశిన్ని మంచినీళ్లొయ్యమ్మా, దప్పికేస్తంది' అని నాగరత్నాన్ని మంచినీళ్లడిగిందట. అమా

సామాన్య మానవుడికి ఈ రోజున ఈ దేశంలో బియ్యం లేవు, పప్పు లేదు, ఉప్పు లేదు, మంచి గాల్లేదు, మంచినీరు లేదు, మంచి పచ్చి మాంసం లేదు, కర్ర లేదు, బొగ్గులేదు, కిరసనాయిల్లేదు, తడుద్దామంటే వర్షంలేదు, ఎండకి నీడ లేదు, కడదామంటే బట్ట లేదు, తోముకుందికి సబ్బులేదు, ఉతుక్కుంది కూడా ఏమీ లేదు, కోపంతో రాసుకుందికి కాగితంలేదు, కొడుక్కి ఉద్యోగం లేదు, మనవడికి స్కూల్లో సీటు లేదు, తినడానికి తిండి లేదు, రిక్షా తొక్కడానికి శక్తిలేదు, చావడానికి కల్తీకాని విషయం లేదు, పండడానికి ఎరువులేదు, తిరగడానికి బస్సుల్లో చోటులేదు, ప్రమాదం లేని రైలు లేదు, దేశంలో పన్ను లేని జాగాలేదు, వస్తువు లేదు, పాటు లేదు, లంచం లేని తావులేదు, మురికిలేని జాగాలేదు, ఖాళీగా ఏ జెయిలూ లేదు, పోలీసు నిఘా లేని అంగుళం మేరలేదు, తుపాకులు పేలని సందులేదు.

– 'రావి శాస్త్రీయం'

యకమ్ముండ కూతురు, నాగరత్నానికా మనిషి గురించేమీ 'తెల్దుకదా' అంచేత సేటక్కడే ఎట్టి ఇస్తానుండమ్మా అన్చెప్పి నీళ్ళ కోసరం ఇంట్లో కెళ్లిందట, ఇంతలో ఆ పాడుక్కాళ్ళ దాకాముండ పోలీసు వాళ్ళొస్తున్నారని ఎలా పసిగట్టిందో ఏమో కాని, ఇంట్లోంచి నాగరత్నం వచ్చేలోపున తెచ్చిన మూటక్కడే ఒగ్గేసి మాయవైపోనాదట. అంతలో "ఏవమ్మోయ్ ఏటా మూటా?" అని అడిగేరట వాళ్ళు. ఎవరూ? పోలీసోళ్ళు ముగ్గురు. యూనేఫారాల్లో వున్నారు. ఒకడు మన తెలుగోడి బట్ట కట్టుకున్నాడు. వాళ్లలా అడిగేసరికి ముంతలో తెచ్చిన నీళ్ళు ముంతలో అక్కడే జార్చేసి, రెండడుగులు వెనక్కి జరిగి "నాకు తెల్దుబాబూ" అందిట నాగరత్నం. "నీకు తెలకుండా నీ ఇంటి కాడ కెలా ఒచ్చింది? రెక్కలెట్టుకొచ్చి వోలిందా? నేక ఇత్తనవేస్తే మొల్చిందా?" అని వాళ్ళడిగేరట. ఆ మనిసాగ్గేసి పోనట్టుంది బాబూ" అందిట నాగరత్నం.

"ఆ మూటేటో తెల్దని ఓ పాలన్నావు, ఆడమనిసొగ్గేసిందని మరో పాలన్నావు. మరింక మూడో పాలేటంటుందో ఏటో మూటిప్పి సూడండ్రా' అని ఆళ్లల్లో ఆ తెలుగు బట్టేసుకున్న జవాను మూట విప్పించేడట.

మూట విప్పించి చూస్తే అందులో ఇంకేముంది? ఒక రెండుమూర్ల మోటారు ట్యూబు ముక్కనిండా మూడు గేలాన్ల దొంగాసారా వుంది. చూసి గజగజ వణికిపోయింది నాగరత్నం.

"అమాయకవుదీ ఆడముండ కూతురూ నిజవే! కాని ఇయన్నీ పోలీసోడిక్కావాలా బాబు? అంజలీదేవి బొమ్మనా మా సక్కగున్నావుగ కాని, ఎవుడికీ తెలకుండా ఎన్నోళ్లనుంచోలె ఈ యాపారవూ, అన్చెప్పి ఆడపిల్లని నదునడమని టేసన్కి నడిపించుకుపోనారు. గోరం కాకపోతే ఇంకేటి నూకరాజు బాబూ"

అని ముగించేరు వాళ్ళు.

ఇంతా జరిగి ఎంతసేపయింది? ఓ గంట సేపయింది! మరైతే నాగరత్నం పోలీసు స్టేషన్లోనా వుంది? అక్కడే వుండుండాలి. ఆ పాడుక్కాళ్ళ దెక్కడికి పోయింది? ఏమో ఎవడికి తెలుసు. మీరంతా చూస్తూ ఎందుకూరుకున్నారు? మేవేం చూళ్లేదే. చూడకపోతే ఈ కథంతా మీకెలా తెలిసింది? 'చూస్తేమట్టుకు మేవేం చేస్తాం; మమ్మల్ని కూడా నడమంటే నువ్వొచ్చి ఇడిపిస్తావా ఏటి?'

మరైతే ఇప్పుడేం చెయ్యడం?

గాభరాపడ్డం తప్ప మరేం చెయ్యడమో తెలియడంలేదు నూకరాజుకి. ఇంటికి పోలీసు వాడొచ్చినా, అప్పల వాడొచ్చినా, యములాడొచ్చినా ఇంట్లో అందరికీ ఒక్కలా వుంటుంది. ప్రాణాలు పోతున్నట్టుగా వుంటుంది. అవతల అప్పాయమ్మక్కూడా గాభరాగానే వుంది. ఆమె అకస్మాత్తుగా ఆపదలో పడ్డంతో గోతులో పడ్డట్టుగా అయిపోయింది. అయితే, గోలచెయ్యడమే కాని గోతులోంచి లేవడమెలాగనే ఆలోచన లేదావిడకి. నూకరాజు బాబూ! అన్నిటికీ నువ్వే వున్నావంటుంది. ఆ మాట నూకరాజుకి మరీ భారంగా వుంది. అయితే ఇప్పుడేం చెయ్యాలి? నూకరాజుకదే తెలీదు. అతను తెలివైనవాడే. కాని అతన్దగ్గిర కిటుకుల్లేవు. మరి – ఎర్రటోపీ, వంటసారా, దొంగకేసు, నల్లకోటు, తప్పుడు సాక్ష్యం, తెలియనితీర్పు, జరిమానా, జెయిలుగోడ ఇటువంటి వాటితో వ్యవహరించి తప్పించుకు తిరిగి ధన్యుడవాలంటే కిటుకులు తెలియాలి. నూకరాజుకవే తెలీవు.

అన్నీ తెలిసిన మేస్త్రీకదున్నాడు. అతన్దగ్గరికి వెళ్తానన్నాడు నూకరాజు.

"ఎక్కడికైతే ఎళ్లు. కాన్నాపిల్లని మట్టుకు నా కప్పచెప్పు, నూకరాజుబాబూ, తండ్రీ ఒచ్చే జనమలో నీ కడుపున పుడతానంది అప్పాయమ్మ.

కాళ్ళీడ్చుకొని నూకరాజు వెళ్ళేసరికి మేస్త్రీ మందు మీదున్నాడు. నిషామీద వున్నప్పటికీ ( నిషామీద వుండడంవల్లనే) అతగాడు నూకరాజు చెప్పిందల్లా శ్రద్ధగా విన్నాడు. వింటూ చుట్టపొగని బాగా లాగేడు. విని, చుట్టపొగని దూరంగా వదిలేడు. పోలీస్ స్టేషన్లో జామీను తెచ్చుకోవాలంటే అయిదు రూపాయలుండాలన్నాడు మేస్త్రీ. తెస్తానన్నాడు నూకరాజు. కాని మరి ప్రమాదముందన్నాడు మేస్త్రీ. జామీను కోసం స్టేషన్కి వెళ్తే వాళ్లు నిన్ను కూడా మోసేసి కాట్లో తోసేగల ప్రమాదముందన్నాడు. నాగరత్నం కోసం అలానే వెళ్లి కాట్లో కూర్చుంటానన్నాడు నూకరాజు. ఇద్దరూ వెళ్లి కాట్లో కూర్చుంటే మీ ఇద్దర్నీ బైటకి లాగేదెవడు?' అని ప్రశ్నించేడు మేస్త్రీ. అయినా పోలీసువాళ్లు అనవసరంగా నన్నెందుకు లోన వేస్తారు? అని అడిగేడు నూకరాజు. నీకేం తెలీదు పొమ్మన్నాడు మేస్త్రీ. తరవాత కొన్ని ప్రశ్నలు వేసేడు.

పిల్ల వయసులో వుందా? వుంది. పిల్ల బావుంటుందా? సినీమాస్టార్లా వుంటుంది. పిల్ల నేరవేం చెయ్యలేదు. నిజమేకదా? చెయ్యలేదు! నిజం! అందుచేత ఏమన్న మాట? ఆ పిల్లమీద అబద్దం కేసెట్టడానికి పిల్ల మీద వాళ్లకి కావేషి అయినా వుండుండాలి. లేదా ఆ పిల్లమీద వాళ్లలో ఎవడో ఒకడు కన్నైనా వేసుండి, చేతులోకి లాగుదామనే ఉద్దేశంతో లోపలకి లాగుండాలి. ఏదైనప్పటికీ 'మద్దెన్నువ్వడ్డొస్తే నిన్ను మరి కోసేరా వాళ్లు?!" అన్నాడు మేస్త్రీ.

'అంతన్నేయవా?" అన్నాడు నూకరాజు.

"నీకూ నాకూ అన్నేయం కాని పోలీసోడిక్కాదు.

"ఇంతమంది బీదజనాన్ని ఎందుకు పుట్టించేడో ఏమిటో ఆ భగవంతుడు?" అన్నాన్నేనొకసారి బాగా భోంచేసి వాలుకుర్చీలో కూర్చొని అరువు సిగరెట్టు హాయిగా కాలుస్తూ.

"మన్లాంటివాళ్ళం కథలు రాయడానికి" అన్నాడు నా పక్కనే మరో కుర్చీలో మరో సిగరెట్టు కాలుస్తున్న నా స్నేహితుడు, అతను మొదటసారిగా బ్రాందీ తాగి, మొదటిసారిగా రొయ్య కూర, కోడి వేపుడూ తిని చాలా హేపీగా వున్నాడు. నాక్కూడా ఆల్కాహాలిక్ నవ్వొచ్చింది. ఇటువంటి సివికల్ స్కాండ్రల్స్‌వి ఇంతమంది వుంటున్న ఈ దేశంలో బీద జనానికి నిజంగా ఏది దిక్కు?

– 'రావిశాస్త్రీయం'

ఆడి సేతిలో పవరుంది. సేతిలో పవరుంటే నెత్తికి పొగరెక్కుతుంది." అన్నాడు మేస్త్రి.

"మరైతే జడ్జికోర్టు నేదా?" అనడిగేడు నూకరాజు.

"ఉండకేం? జడ్జికోర్టూ వున్ది. మున్సీబు కోర్ టూవున్ది. మేస్ట్రీటు వోరి కసేరీ కూడా వున్ది. కాని అక్కడాళ్లందరూ కళ్లు మూసుకోని తూకం ఎయ్యాలంట. అది రూలు. నీకు తెల్దు కామోసు" అని మనకి పడమట నుంచి పంపిణీ అయిన న్యాయశాస్త్రపు మూలసూత్రాన్ని నూకరాజుకి టూకీగా తెలియజేసేదు మేస్త్రి. మేస్త్రిదగ్గర అన్ని విషయాలూ తెలుసుకున్నాడు కాని ఏమీ హెచ్చరిగ్గా లేదు నూకరాజుకి. ఆఖరికి మేస్త్రి ఏవిటన్నాడంటే 'రేపు కోర్టు కెళ్లాల. తేలే రంగేదో అక్కడే తేలాల" అన్నాడు.

ఇంటికి తిరుగుముఖం పట్టేడు నూకరాజు. మనసంతా ఎలా వుండాలో అలా వుంది నూకరాజుకి. అంతా తల్చుకొంటే అతనికి ఆదో విధమైన జుగుప్స కలిగింది. నాగరత్నం పోలీస్‌స్టేషన్లో ఉన్నదనే విషయం అతని అణువణువునీ బాధపెట్టింది. బంగారు చిలకని అలుగ్గుడ్డలో అదిమి పెట్టినట్టుగా అనిపించిన దతనికి. మల్లెమొగ్గని మంటలోకి తోసినట్టుగా అనిపించిందతనికి. అసలతనికి ఇంటికి వెళ్లాలనిపించడంలేదు. పిల్ల ఏదని అడిగే అప్పాయమ్మతో ఏమని చెప్పడం? నాగరత్నాన్ని, వెన్నెల్లో ఇసక తిన్నెమీద కూర్చొని, ముద్దులాడ్డం సులభమే. "ఆ పని నువ్వే చెయ్యాలా ఏవిటి? చాలామంది చెయ్యగల్రు, చేతనైతే చిలక పిట్టని ఇనపతెర వెనక నుంచి బైటకి లాగి అప్పుడు చూపించు నీ తడాఖా" అని అప్పాయమ్మ అనదు. కాని ఆమె అన్నట్టుగానే బాధ పడ్డాడు నూకరాజు. అతనికి వళ్లంతా చెమట పట్టేసింది. అతనికేదో ఒకటి చెసేద్దామనుంది కాని ఏం చెయ్యాలో ఏ విధంగా చెయ్యాలో అతనికి తెలియడం లేదు. బలమైన పనులు చాలా చెయ్యగలడతను. కాని ఈ పని చెయ్యలేకుండా వున్నాడు. అర్థవై ఘనపుటడుగుల బండరాయిని ఎత్తుకు తిరగగలిగీ ఆరడుగులే లోతున్న నీట్లో ఈదలేని వాళ్లా అయిపోయేడతను. ఇంటికి వెళ్తూన్నప్పుడు నెత్తిమీద ఏ బరువూ లేకపోయినా అతని అడుగు నెమ్మదిగానూ బరువుగానూ పడుతోంది. ఆ అడుగలా బరువుగా పడిపడి ఇంటికి అర్థవై అడుగుల దూరంలో ఆగిపోయింది. ఆగి చూస్తే అతనికి మరో దృశ్యం కనిపించింది.

అప్పాయమ్మ గది గుమ్మంలో దీపం వెలుగుతోంది. దీపం పక్క నాగరత్నం కూర్చోనుంది. ఆమె దేదీప్యమానంగా వెలుగుతోంది.

చిన్నప్పుడొకసారి నూకరా జింట్లోంచి ఆవొకటి తప్పిపోయింది. దాని కోసం ఊరంతా తిరిగి తిరిగి అది దొరక్క, పోగా 'వెర్రి మొహం' వేసుకొని వెనక్కి తిరిగొచ్చేడు. ఇంటికొస్తే అది గుమ్మంలో కట్టేసుంది. అప్పుడు సంతోషించకుండా వుండలేక పోయాడు కాని అదోలా 'ఫీ'లయేడు. కళ్లుమూసి జెల్లకొట్టి కంటిముందు మిఠాయిపొట్లం పెట్టినట్టయింతనికి. తిరిగి అలాగ మళ్ళీ ఫీలయేడు నూకరాజు.

రాత్రి పదిగంటలవుతుంది. గుమ్మంలో నాగరత్నం కూర్చొనుంది. ముంగిట పదిపదిహేను మందిదాకా కొలువుతీర్చి కూర్చున్నారు. మామూలుస్థానంలో విరిగిన ఇటిక ముక్క వేసుకొని అప్పాయమ్మ కూర్చొనుంది. వాళ్లందరికి ఎదురుగా నులకమంచం మీద ఠీవిగా మరో ఆసామీ కూర్చున్నాడు. నూకరాజుతో పాటు మరో నలుగురైదుగురు కూడా అప్పుడే వచ్చి కూర్చోడంతో అతని రాక నెవరూ గమనించలేదు.

నూకరాజు గుండెలు నీరసంగా కొట్టుకున్నాయి. గుమ్మంలో పిల్లని చూడగానే నెత్తిమీద బరువు దిగిపోయినట్టుగా అతను తేలిక పడ్డప్పటికీ, అతనికి వంట్లో సత్తువంతా కూడా దాన్తో పాటు పోయినట్టయింది. చుట్టూ కూర్చున్నవాళ్లంతా మంచం మీద కూర్చున్న ఆసామివైపే చూస్తున్నారు. అతన్ని అప్పాయమ్మ తెగ పొగుడుతోంది.

> **నాకు రాయలని లేదు, ఎంచేతవంటే మరి చూడండి. నీతులు గోతుల్లోకి పోతున్నాయి. పాపాలు కొండలెక్కి కోటలు కట్టుకుంటున్నాయి. వారి బందూకులు బ్రహ్మ చెముడు డొంకల్లా పెరుగుతున్నాయి, జనాన్ని వేటాడుతున్నాయి. ఇటు జనంలో అజ్ఞానం అక్షరంగా వుంది. అటు పాలకుల తుపాకీలకు అక్షరాలు పూల తోరణాలు కదుతున్నాయి. ఎక్కడ చూసినా మబ్బుగానూ, గబ్బుగానూ వుంది.**
>
> **అయితేసరేకానీ నాకు అందుకే రాయాలని వుందేమో!**
>
> **— 'రావిశాస్త్రీయం'**

ఆ సమయంలో నూకరాజుకి తన చిన్ననాటి సంగతొకటి తటాల్న గుర్తుకొచ్చి ఆనాటి దృశ్యం అతని కళ్ళముందు నిల్చింది.

తల్లీ తండ్రీతో పల్లెటూళ్లోనే ఉండేవాడు నూకరాజు. అప్పటికి బాగా చిన్నవాడు. పశువుల్ని చూసే పనంతా అతన్దే ఆ రోజుల్లో. అప్పట్లో అతనికి రవ్వలకొండ అనే చెలికాడుండేవాడు. ఓ రోజున— ఇంకా మధ్యాహ్నం కాలేదు—పదీ పదకొండు గంటలవుతుందేమో— తమ కళ్లం దగ్గర పాకలో పొయ్యి దగ్గరెందుకో గాని కూర్చున్నాడు నూకరాజు.

బైట కనుచూపు మేరలో అంతా పచ్చపచ్చగా ఎర్రగా కనిపిస్తోంది. గాలి మందమందంగా వీస్తోంది. దుమ్మెక్కడా లేకపోడంచేత, వడబోసినట్టుగా ఎండ శుభ్రంగా వుంది. రాజుగారి లోగిట్లో సిమెంటు గచ్చులా ఆకాశం చక్కగా సాఫుగా మెరుస్తోంది. దూరాన్న వున్న కొండల గుంపులు ఘనీభవించిన మబ్బుల్లా కనిపిస్తున్నాయి. నీట్లో చేపలగుంపులా ఆకాశంలో కొంగలబారొకటి గీతగీసుకుని గిడిమీద పోతున్నట్టుగా నిదానంగా పోతోంది. కాలవకవతలి వైపున మామిడితోటల్లో చిలకలు చేసే అల్లరి కలకల వినిపిస్తోంది. దూరాన్న రామినాయిడి పొలంలో కుప్పమీదికి చేనుకట్టలు ఎగురుతున్నాయి. కుప్పమీద కుర్రవాడొకడు ఎగిరిగెంతి తలపాగా ఊడిపోగా కేకలేసి సర్దుకొంటున్నాడు. ఎక్కడో ఆడంగులు పాడేపాట గాలికి కెరటాలు కెరటాలుగా వినవస్తోంది. అల్లంత దూరంలో గట్టంట ఓ పదేళ్లపిల్ల కుడిచేతిని చక్రంలా తిప్పుకుంటూ చెంగుచెంగున పరుగెడుతోంది. కళ్లంలోని కమ్మలపాలలో కూర్చొని చూస్తే అంతా స్వచ్ఛంగా సుందరంగా నిజంగా దేముడు సృష్టించినట్టుగానే వుంది. పచ్చగా ఆకుపచ్చగా నీలంగా నిర్మలంగా లోకంలో పాపం అంటూ ఎక్కడా లేనట్టుగా వుంది.

సాల్లో పొయ్యిదగ్గర కూర్చున్నవాడు లేచి బైటకొచ్చి సాలముంగిట నిల్చున్నాడు నూకరాజు. నిల్చున్నా డేకాని నిల్చున్న కొంతసేపటిదాకా తన పక్కనే రవ్వలకొండ కూడా నిల్చున్నాడని చూసుకోలేదతను.

రవ్వలకొండ అంత నిశ్చలంగా ప్రతిమలా నిల్చున్నాడు. ఆ కుర్రవాడి ముఖం ఆ సమయంలో అతి అమాయకంగా ఉంది. బాల బుద్ధుల్లా ముఖం పెట్టి నిల్చున్నాడు. కాని వెనక్కి దాచిన అతని చేతుల్లో అలుగ్గుడ్డొకటుంది. ఏవిట్రా వీడెందుకిలా నిల్చున్నాడూ?' అని నూకరాజు అనుకునేలోపున ఓ పిట్ట కీచుకీచుమంది. అంతలో మరో పిట్ట కూడా కీచుకీచుమంది. ఏవిటని చూస్తే రవ్వలకొండ చేతిలో అలుగ్గుడ్డ మధ్య ఓ పిట్ట-- మూడు రంగుల్తో ముద్దుగా వుందది— గిలగిల్లాడుతోంది. పక్కనున్న జామిచెట్టుమీంచి మరో పిట్ట గాభరా పడి రివ్వున పదడుగులు పైకెగిరి మళ్ళీ చెట్టుమీద వాలి తన (ప్రియుడా? ప్రేయసా?) నేస్తం కోసం విలవిల్లాడిపోయి గోలగోల పెట్టేసింది.

ఆ సమయంలో – మధ్యాహ్నం తోడిపోసుకున్న నూతి నీళ్ళల్లా గాలి చల్లగా హాయిగా ఉంది. శీతాకాలంలో వేసుకున్న చలిటోపీలా ఎండ వెచ్చగా సుఖంగా ఉంది. గంగతో కడిగినట్టుగా ఆకాశం నిర్మలంగా ఉంది. పండిన పొలాల్తో భూమంతా బంగారంలా ఉంది. అల్లంత దూరంలో మామిడి తోటలు నందనవనంలా ఉన్నాయి.

మరి అలాంటి సమయంలో అలుగ్గుడ్డదెబ్బ తమమీద పడుతుందని పిట్టల జంటకి తట్టలేదు. అవి గొంతుకలు చించుకుని గోలపెట్టి

భగవంతుణ్ణే ఎలుగెత్తి ప్రార్థించేయి.

పిట్టని "ఒగ్గిరా" అన్నాడు భగవంతుడు నూకరాజు ద్వారా. రవ్వలకొండ ఒగ్గలేదు. చేతిలో వున్న పిట్టని చెట్టుమీదున్న పిట్టకి చూపించి ఊరించడం మొదలుపెట్టేడు.

అప్పుడు నూకరాజేంచేసేడంటే: పక్కనున్న కర్ర తీసి రవ్వలకొండ చేతిమీద సడెన్‌గా బలంగా కొట్టేడు. ఆ కొట్టడంలో ఇద్దరూ కుస్తీకి దిగిపోయి నేలమీద పడి పోయి చిక్కుపడిపోయేరు. 'పెద్దోళ్లొచ్చి' ఇద్దర్నీ తన్ని విడిపించవలసొచ్చింది. కాని అదంతా వేరే సంగతి. ముందా పిట్టల జంట తుర్రున పైకెగిరి రెక్కసాచి నందనవనంలోకి ఎగిరిపోయింది. నూకరాజుకి ఆనాటి విషయమంతా గుర్తుకొచ్చి, ఆదృశ్యం అంతా కళ్ళకి కట్టినట్టయింది.

ఆనాడు అలుగ్గడ్డలో పిట్టని పట్టుకున్న రవ్వలకొండ ఇప్పుడు పట్నంలో పోలీసు జవానుగా వున్నాడు. ప్రస్తుతం అప్పాయమ్మ ఇంటిముందు మంచంమీద తాజుగా రాజులా కూర్చున్నాడు. అతని నోట్లోంచి నూటిగా పైకొచ్చే సిగరెట్టు పొగ రంగుల మేఘంగా అల్లుకొని వన్నెలూ చిన్నెలూ తెచ్చుకొని వయ్యారంగా నాట్యం చేస్తోంది. రవ్వలకొండ కాలుమీద కాలు వేసుకొని, రెండు చేతులూ వెనక్కి ఆన్చి, తల పైకెత్తి, సిగరెట్టుని నోట్లో విల్చోబెట్టి, చూరుకిందకి వారచూపు చూస్తున్నాడు.

ఈ కథకి రవ్వలకొండ విలననే సంగతి వేరే చెప్పనక్కర్లేదు.

చూరుకింద గుమ్మంలో దీపవు వెలుగులో మెరిసే నాగరత్నంకళ్ళు కాంతి పుంజాల్ని వెద జల్లుతున్నాయి. ఆమె కళ్లనిండా రవ్వలకొండే వున్నాడు. ఆమె మనసు అటు ఊగిందనడానికి పెద్ద తార్కాణం ఏమీ అక్కర్లేదు. ఆమె దొక్కచూపు చాల్ను కథంతా తెలియడానికి.

నూకరాజు మానసికంగా కుప్పకూలి పోయేడు. బంగారు పువ్వుక్కూడా పురుగుపడుతుందని అతననుకోలేదు.

అతని రాకని అప్పాయమ్మ చూడలేదు. అతణ్ణే రవ్వలకొండ గుర్తించనేలేదు. రాకపోకలు గమనించే అవస్థలో నాగరత్నం లేనేలేదు. దగ్గే ముసలాయన మాత్రం నూకరాజుని చూసి పలకరించేడు. అంతట అప్పాయమ్మ కూడా అతన్ని చూసి, పోయిన పెన్నిధి తిరిగెలా ఒచ్చిందో జరిగిన సంగతేమిటో అంతా చెప్పింది.

మేస్త్రి దగ్గరకి నూకరాజు వెళ్లొచ్చేలోపున "అంతా రొండు మినేట్లలో చెటిల్మెంటయిపోనా"దట. ఈ జవానుబాబు – దరమదాత – దేవుల్లా ఒచ్చిపడి పేనానికి పేనం ఆడ్డేసి పిల్లని బైటకి లాగేసి" నాట్ట.

"ఇనకాస్ పెట్రో ఏటో, ఆ మాటే నాకు రాదు. ఆ బాబు పేరేటి బాబూ?" అనడిగింది అప్పాయమ్మ కొండబాబుని.

"సబినస్పెట్రు" అన్నాడు కొండబాబు.

"అవునాబాబే" అంది నాగరత్నం.

"అది. ఆ బాబుతో ఈ బాబు సంగతేటో అసలేటి జరిగిందో ఏదో, అంతా టకాల్‌టకాల్ మని మూడు ముక్కల్లో సెప్పేసినాడు. 'పిల్లనూస్తే ఒట్టి ఎర్రిగొర్రే. తల్లి నూస్తే దిక్కుమాలినముండా, ఆ సారా అంటే యేటో సారాయేపారం అంటే ఏటో ఆళ్ళెరగరూ, ఎండాడముండా మూటొగ్గేసి పోనాదిగాని. ఈ పిల్లకి సారా అంటే నూపేనేదూ" అని ఆ పెద్దబాబుతో సెప్పేసి ఆ బాబు నొప్పించి పిల్లవిడిపించుకొచ్చినాడు – ఈ బాబే" అని చెప్పి రెండు చేతులూ ఎత్తి జోడించి రవ్వల కొండవైపు తిరిగి "రచ్చించినావు కొండబాబూ! రచ్చించినావు. యెయ్యి దేవుళ్ళతో సమానం నువ్వు" అంది అప్పాయమ్మ. ఒక పోలీసువాడు వెయ్యి దేవుళ్ళతో సమానమనే సంగతి నూకరాజుకింకా తెలీదు.

జరిగిన సంగతంతా చెప్పేక అప్పాయమ్మ ఇంకా ఏమన్నదంటే: "నూకరాజు బాబూ, జవాన్‌గోర్ని ముందే ఎరిగుంటే అప్పడే ఎళ్ళి ఆ బాబు కాళ్ళట్టుకుందువు. ఎడాంసెత్తో ఈ బాబప్పడే ఈ సిక్కంతా ఇడదీసేసును. అసలప్పడీ సిక్కే నేకపోను" అంది అప్పాయమ్మ.

అయితే 'ఈ సిక్కంతా ఎలా ఒచ్చిందో' అప్పాయమ్మకీ తెలీదు, నూకరాజుకీ తెలీదు. అధికార్లనేవాళ్లుంటారని వాళ్ళకి తెలుసు. కాని, అధికార్లకి కత్తులుంటాయనిగాని అవి రెండువైపులా పదునుగా వుంటాయనిగాని వాళ్ళకి తెలీదు. కోటీశ్వరన్‌గారు నీ కంటపడకుండా నిన్ను గుమ్మంలోంచి తరిమికొట్టగలదు; లేకపోతే, నీ చేత పది రూపాయిలు పెట్టి నీ చేత కాళ్ళు పట్టించుకోనూగలదు. మంత్రిపుంగవుడు నిన్ను కొమ్ముల్తో పొడవగలదు; కాకపోతే, పాలకుల ప్రతినిధి కాబట్టి నీకు పాలిప్పించి సాకనూగలదు. న్యాయాధిపతి నీ మీద వచ్చిన సాక్ష్యాన్ని నమ్మనూగలదు; నమ్మకపోనూగలదు. రక్షకభటుడు నీ మీద లేని నేరాన్ని సృష్టించగలదు; వున్న నేరాన్ని మాఫీ చెయ్యగలదు. పక్క సందులోంచి గూండా నీ ఇంటిమీదకి రాళ్లు రువ్వించనూగలదు; రువ్వినవాణ్ణి తిప్పి కొట్టనూగలదు. వాళ్ళందరూ కూడా నిన్ను తహతహలాడించగలరు. లేకపోతే మేల్ మేలని నీ చేత చేయెత్తి దండాలు పెట్టించకోనూగలరు.

వెర్రిగొర్రెలు నువ్వూ నువ్వూను, వాళ్లు కాదు.

అందుచేత ఆనాటి ఆ వెన్నెల రేయి రవ్వలకొండకి జేజేలు కొట్టి బాజాలతో వెళ్ళింది.

మర్నాడు సాయంకాలం మార్కెట్టునుంచి చేపలు కొనుక్కొని ఒస్తూన్న నాగరత్నం నెత్తిమీద కిరీటం పెట్టుకు నిలుచున్న కొండబాబుని చూసి పకోడీల దుకాణం పక్క ఆగి అతనివైపు ఓరగా చూసింది. రవ్వలకొండ ఆమె దగ్గరకి వెళ్ళి పలకరించి మొన్న రాత్రి సినీమాలో నాయకుళ్ళా నవ్వునవ్వి, ఆ నవ్వులో ఆమెకి కితకితలు పెట్టి చివరకామెని సాగనంపి వచ్చీ రావడంతో మరో నెంబరు టోపీ అతణ్ణి వీపు మీద సెభాష్మని చరిచి,

"బలేపిట్టని పట్టేవే" అన్నది.

"మరి, కిస్తా ఎలాటి కిస్తా ఏసేనను కున్నావ్!" అన్నాడు రవ్వలకొండ.

"ఏటాకిస్తా?" అన్నాడు రెండో జవాను.

అంటే అంతా చెప్పేడు రవ్వలకొండ.

అప్పడా మరో నెంబరుగల రెండవ జవాను ఆశ్చర్యపోయి,

"ఎనకనించి గోతుల తోసెయడవూ నువ్వే!? ముందుకొచ్చి సెయ్యట్టుకు లెగదియ్యడవూ నువ్వే!

అన్నాడు.

" గోతిలోకి తొయ్యకపోతే సేతిలోకెలా ఒస్తందనుకున్నావ్?" అని ప్రశ్నించేడు రవ్వలకొండ.

మరో నెంబరుగల టోపీగలవాడు అంతట ఒక్కక్షణం సేపు గుడ్లు పెద్దవి చేసి అరక్షణం సేపు ఆలోచించి, తలనూపి, "అన్నేయవైతే అయిందిగాని, గొప్ప రేంజిమెంటు చేయిస్పినావురా! నీ దగ్గర – ఎవడాడు? – శకునిమావ, శకునిమావ కూడా నీ దగ్గిర బలాదూర్" అని మెచ్చుకున్నాడు. అతని కళ్లు ఆనంద బాష్పాలతో నిండిపోయేయి.

మొన్నటి నాయకుడి నవ్వు మళ్లీ నవ్వేడు రవ్వలకొండ. నవ్వుతూ ఏమన్నాడంటే: "అయి మనకి తెల్లోడిచ్చేడ్రా!" అన్నాడు.

"తెల్లోడేటిచ్చేడు మనకి?"

"ఫుల్ పవర్స్ – పులిపవర్లిచ్చేడు. అంచేత, పట్టుపట్టడం మనవే ఇడుపు ఇడవడవూ మనవే. అంతా మనిష్టం. మనకత్తెలాటికత్తో ఎవరికా? మన కత్తికి రెండేపులా వాడే! గేపకవుంచుకో!" అన్నాడు రవ్వలకొండ.

మరో నెంబరు జవాను – కొత్తగా సర్వీసులో చేరేడు – గురూపదేశాన్ని గుర్తుంచుకొనే వుంటాడు.

బైట కనుచూపు మేరలో అంతా పచ్చపచ్చగా ఎర్రెర్రగా కనిపిస్తోంది. గాలి మంద మందంగా వీస్తోంది. దుమ్మెక్కడా లేకపోవడంచేత వడబోసినట్లుగా ఎండ శుభ్రంగా వుంది. రాజుగారి లోగిట్లో సిమెంటుగచ్చులా ఆకాశం చక్కగా సాపుగా మెరుస్తోంది. దూరాన్న వున్న కొండల గుంపులు ఘనీభవించిన మబ్బుల్లా కనిపిస్తోన్నాయి. నీట్లో చేపలగుంపులా ఆకాశంలో కొంగల బారొకటి గీత గీసుకుని గోడ మీద పోతున్నట్టుగా నిదానంగా పోతోంది.

అందుచేత, నాగరత్నం ఆ విధంగా వలలోపడి, గాలిలోపడి చివరకి జవానుగారి వళ్ళోపడింది. ఆమె అలా రవ్వలకొండ వళ్ళో పడగలదని అనుకున్నాడు కాని పడిపోయిందని తెలుసుకోలేదు నూకరాజు. ఆమె తనకి ఎడంగా పోతుందని గ్రహించేడు, కాని ఆమెని తిరిగి దగ్గరకెలా తెచ్చుకోవాలో తెలుసుకోలేకపోతున్నాడతను. లోకం నైజం తెలిసినవాడంత కష్టపడడు. నూకరాజు మాత్రం చాలా బాధపడ్డాడు. అయితే, ఆ బాధ ముసురు ముసురుగానే వుంది. చివరకోరోజున అది తుఫానుగా మారింది.

రాత్రి డ్యూటీ దిగి ఇంటికొస్తున్నాడు నూకరాజు. రెండో ఆట సినిమా విడిచిపెట్టేరు. జనం చాలామంది వెళ్ళిపోతున్నారు. అతనూ సినిమాగేటు దాటేసరికి జనం పల్చబడ్డారు. గేటు దగ్గరుండే రిక్షాలగుంపు చెదిరిపోయింది. అప్పుడు చూసేడు నూకరాజు.

పక్కనున్న ఓ కిల్లీకొట్టు దగ్గర సిగరెట్టు అప్పుడే ముట్టించి చకచక ముందుకి నడిచేడు మఫ్టీలో వున్న రవ్వలకొండ. అతని మెళ్ళో పాములాటి మఫ్లరుంది. చేతిలో వజ్రాయుధంలా ఓ టార్చిలైటుంది. దుకాణానికి పదడుగుల దూరంలో ఓ ఆడమనిషి నిల్చొని అతని కోసం నిరీక్షిస్తోంది. ఆమెని చూసి నాగరత్నం అనుకోలేదు నూకరాజు. ఆమెని పోల్చగానే అతని వళ్ళంతా గజగజ వణికింది. ఆమె పూర్వం ఎలా వుండేదంటే పొద్దున్నే పూసిన సొగసైన పువ్వులా వుండేది. ఇప్పుడామె దీపాల వెలుగులో వజ్రాల విగ్రహంలా కనిపిస్తోంది.

అలా నిల్చుండిపోయేడు నూకరాజు. వాళ్ళతణ్ణీ చూళ్ళేదు. ఆమెకి దగ్గరగా వెళ్ళి రవ్వలకొండేదో అన్నాడు. ఆమె కూడా ఏదో అంది. రెండడుగులుఇద్దరూ ముందుకి నడిచేరు. మరో మూడడుగులు ముందుకి నడిచి రిక్షాని కేకవేసేడు రవ్వలకొండ. జెబ్బపట్టుకొని నాగరత్నాన్ని రిక్షా ఎక్కించి తనూ అందులో కూర్చున్నాడు రవ్వలకొండ. రిక్షా కదిలింది.

వాళ్ళిద్దరూ నడుచుకు వెళ్లిపోయినా బావుందునేమో. కాని ఆ విధంగా వాళ్లిద్దరూ జంటగా రిక్షాలో వెళ్ళడం చూసిన నూకరాజు వాళ్ళిద్దరి సంబంధాన్నీ కళ్లారా చూసినట్టుగా బాధపడ్డాడు. అతనికి కడుపులో దేవేసినట్టయింది. అతని కాళ్ళకింద భూమి వణికింది. నీరసంగా కిల్లీకొట్టుదాకా నడిచి అక్కడ పైనున్న బల్లమీద కూర్చుండిపోయేడు. అయిదు నిమిషాలసేపు అలాగే వుండిపోయేడు.

నూకరాజుకి తల దిమ్మెక్కిపోయింది. అతను వెలిగించుకున్న జ్యోతులన్నీ అకస్మాత్తుగా అతని కట్టెదుటే ఏట్లోకి దిగిపోయి ఆరిపోయాయి. అతను వేసుకున్న రంగుల డేరా అతని కళ్లెదుటే మండి మాడి మసైపోయి మాయమైపోయింది. అతను వేసుకున్న పూలతోట అరక్షణంలో పాములపుట్టగా మారిపోయింది. అతనికి తూర్పు దిక్కు ఎటో వెళ్ళిపోయి పడమట దిక్కు ఎదురొచ్చింది. అతని వళ్ళంతా జలదరించింది. అతని మనసులో తుఫాను రేగి చెలరేగింది.

కిల్లీకొట్టువాడు దుకాణం మూసేడానికి ముందు ఆ రోజొచ్చిన డబ్బుల లెక్క పెట్టుకొంటూ, దబ్బున ఏదో పడ్డ చప్పుడు చెవిని పడీపడ్డంతో తుళ్ళిపడి తలెత్తి చూసేడు. చూస్తే కొట్టుముందర బల్ల తిరగబడిపోయింది. పదిగజాల దూరంలో హోర్బరు కళాశీ ఒకడు పులిలా పరిగెడుతున్నాడు. పదినిమిషాల తరవాత, లేక పదినిమిషాల్లోపు నేనేమో దివాన్జీగారి ప్రహరీగోడ పక్క వెన్నెల కూడా నొరలేకుండా పాపంలా పెరిగిన చెట్ల దట్టపు చీకట్లో రోడ్డుమీద ఓ రిక్షా తిరగబడిపోయింది. ఓ రిక్షా వాడు బాబో బాబో అనుకొంటూ పరిగెట్టి పారిపోయేడు? ఆ వెంటనే, రూళ్ల కర్రతో కొబ్బరిపీచుమీద కొట్టినట్టుగా కొద్దిసేపు చప్పడయింది. ఓ మగవాడి మూలుగూ, ఓ ఆడమనిషి ఆర్తనాదం చెట్లనీడల్లో చిక్కుకుపోయి, చీకట్లో క్షీణించిపోయేయి.

పావుగంట తరవాత ఊరవతల నూకరాజు పాకవతల ఇసక మైదానంలో జంట తాటిచెట్ల దగ్గర కూర్చొనున్నాడు నూకరాజు. అతనిపక్కనే రక్తంతో తడిసిన టార్చిలైటొకటి ఇసకలో పడుంది.

రాత్రి రెండుగంటలు దాటింది. చల్లగాలి చేసే సవ్వడి తప్ప మిగతా అంతా నిశ్శబ్దంగా వుంది.

అలిసిపోయిన వాళ్ళూ, అంతా పోయినవాళ్ళూ, మరింక ఎత్తిళ్లనివాళ్ళూ, దెబ్బతిన్నవాళ్ళూ, దరిద్రులూ, దౌర్భాగ్యులూ ఎలా కూర్చుంటారో అలానే మోకాళ్లమీద తలపెట్టుక్కూర్చున్నాడు నూకరాజు.

ఒక్కసారి కాబోలు తలెత్తి చూసేడు.

అతని చుట్టూ వున్నది ఎడారీ కాదు. అక్కడ మండుటెండాలేదు.

అది శ్మశానమూ కాదు. అక్కడ తుఫానూ లేదు. ఆనాడు నాకు తెలిసిన పెద్దమనిషి చెప్పిన ప్రకారం నేను వర్ణించాలనుకొంటే అది ఆ విధంగా లేనేలేదు.

అతని చుట్టూ అదంతా ఎలా వుందంటే స్వర్గంలో భాగంలా వుంది.

వర్షం పడి బంగారుపొడి రాలినట్లుగా మైదానమంతా మిలమిల మెరుస్తోంది. పాలరాతి మందిరంలో నీలిరంగు దీపంలా వెన్నెలంతటా నిగనిగలాడుతోంది. ఎన్నెన్నో పూలతోటల్ని ముద్దులాడొచ్చినట్లుగా చల్లగాలి కమ్మకమ్మగా వీస్తోంది.

అక్కడదంతా మోహనంగా దివ్యంగా వుంది. అది నువ్వెప్పుడో చూసిన చక్కని బొమ్మలా వుంది. అది నువ్విదివరకెన్నడూ చూడని మనోహరమైన చిత్రంలా వుంది.

ఆ సమయంలో వెన్నెలతో నిండిన నూకరాజు కళ్లు మాత్రం మరుగునీళ్ళతో నిండేయి. మరుగునీళ్లతో నిండిన అతని కళ్ళు మంటలతో మండేయి.

అవునంతే మరి అలానే జరుగుతుంది.

మెరిసే నీ కళ్ళంట చుక్కచుక్కలుగా నెత్తురంతా రాల్తుంది. బంగారు చేలమధ్య బ్రతికే నీ బ్రతుకంతా బూడిదపాలే అవుతుంది.

నువ్వు నిలబెట్టుకున్న నీ ఇల్లొకనాటి శరద్రాత్రిలో చల్లగాలిలో వెన్నెల తడిలో భగ్గునమండి తగలడుతుంది. నీ కాపురమంతా చప్పన కాలి చల్లారుతుంది. భగవంతుడు దయతో సృష్టించిన ఈ దివ్యలోకంలో నీకాఖరికి దిక్కుమాలిన చావు దక్కుతుంది. అవును. మరి అలానే జరుగుతోంది కదా! ◆


అతని చుట్టూ అదంతా ఎలా వుందంటే స్వర్గంలో భాగంలా వుంది. వర్షంపడి, బంగారుపొడి రాలినట్లుగా మైదానమంతా మిలమిల మెరుస్తోంది. పాలరాతి మందిరంలో నీలిరంగు దీపంలా వెన్నెలంతటా నిగనిగలాడుతోంది. ఎన్నెన్నో పూల తోటల్ని ముద్దులాడొచ్చినట్టుగా చల్లగాలి కమ్మ కమ్మగా వీస్తోంది. అక్కడంతా మోహనంగా దివ్యంగా వుంది. అది నువ్వెప్పుడో చూసిన చక్కని బొమ్మలా వుంది. అది నువ్విదివరకెన్నడూ చూడని మనోహరమైన చిత్రంలా వుంది. ఆ సమయంలో వెన్నెలతో నిండిన నూకరాజు కళ్లు మాత్రం మరుగునీళ్ళతో నిండేయి. మరుగునీళ్ళతో నిండిన అతని కళ్ళు మంటలతో మండేయి. అవునంతే మరి అలానే జరుగుతుంది.

మెరిసే నీ కళ్ళంట చుక్క చుక్కలుగా నెత్తురంతా రాల్తుంది. బంగారు చేల మధ్య బ్రతికే నీ బ్రతుకంతా బూడిదపాలే అవుతుంది. నువ్వు నిలబెట్టుకున్న నీ ఇల్లొకనాటి శరద్రాత్రిలో చల్లగాలిలో వెన్నెలతడిలో భగ్గున మండి తగలడుతుంది. నీ కాపురమంతా చప్పన కాలి చల్లారుతుంది. భగవంతుడు దయతో సృష్టించిన ఈ దివ్యలోకంలో నీకాఖరికి దిక్కుమాలిన చావు దక్కుతుంది.

అవును. మరి అలానే జరుగుతోంది కదా!